నమస్తే తెలంగాణ
# నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 10 ఫిబ్రవరి 2025 | NALGONDA

## ఆగి ఉన్న బస్సులో 25 లక్షలు చోరీ

నార్కట్‌పల్లి ఫిబ్రవరి 9 : ఓ ప్రయాణికుడు బస్సు దిగి టిఫిన్ చేసి వచ్చేలోగా రూ. 25లక్షల నగదు ఉన్న బ్యాగును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి శివారులోని జాతీయ రహదారిపై పూజిత హోటల్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లకు చెందిన వెంకటేశ్ అనే వ్యాపారి రూ. 25 లక్షల నగదును తీసుకొని చెన్నై నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సును ఎక్కాడు. ఈ క్రమంలో గోపలాయపల్లి శివారులోని పూజిత హోటల్ వద్దకు రాగానే వెంకటేశ్ తనతో తీసుకువచ్చిన నగదు ఉన్న బ్యాగును అక్కడే పెట్టి బస్సు దిగి టిఫిన్ చేయడం కోసం వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చేలోగా తన నగదు ఉన్న బ్యాగు కనిపించలేదు. వెంటనే బాధితుడు పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలికి సీఐ నాగరాజు, ఎస్ఐ క్రాంతికుమార్ సందర్శించి సీసీ కెమెరాలను పరిశీలించారు. బస్సు నుంచి నగదు ఉన్న బ్యాగును గుర్తు తెలియని ఓ వ్యక్తి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్న సెస్ డైరెక్టర్ రేవతి తదితరులు

## సమగ్ర పరిశోధనలే సమాజానికి మార్గదర్శకాలు

**తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ సమావేశంలో సెస్ డైరెక్టర్ రేవతి**

రామగిరి, ఫిబ్రవరి 9 : నేటి ఆధునిక సమాజాభివృద్ధికి సమగ్ర పరిశోధనలు మార్గదర్శకత్వం వహిస్తాయని సెస్ డైరెక్టర్, ప్రొఫెసర్ రేవతి అన్నారు. ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఎకనామిక్ అసోసియేషన్ 9వ ఆదివారం ఎంజీయూలో కొనసాగింది. దీనిలో భాగంగా ఆమె ముగింపునకు హాజరై మాట్లాడారు. ఆర్థిక వృద్ధి, సామాజిక చలన శీలతకు ప్రధాన మార్గం విద్య అయినందున, నాణ్యమైన విద్యకు పరిశోధనలు విస్తృతంగా జరుగాలని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా కొంత మార్పులు జరుగుతున్నప్పటికీ నాణ్యత, మార్పునకు అనుకూలమైన నైపుణ్యాల లేమి స్పష్టంగా కనబడుతున్నదని తెలిపారు. పేద, మధ్య తరగతి, గ్రామీణ జీవితాల్లో విద్యా వ్యయం నానాటికీ పెరుగుతున్న దృష్ట్యా ఉపాధ్యాయులు బాధ్యతగా వ్యవహరించాల్సిన సమయం ఆసన్నమైన్నదని చెప్పారు.

అనంతరం జరిగిన సమావేశంలో అసోసియేషన్ పాలక మండలి భేటీలో కొత్తగా మహేంద్ర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాజు, సెస్ ప్రొఫెసర్ సురేశ్‌రెడ్డికి స్థానం కల్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కట్ట ముత్యం రెడ్డి, ఎంజీయూ ఎకనామిక్స్ అధిపతి, సదస్సు కన్వీనర్ కొప్పుల అంజిరెడ్డి, సెక్రటరీ వెంకటేశ్వర్‌రావు, కేవీ శశిధర్, జి.పండరయ్య, సైదులు, వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెరువులు వెలవెల

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం, బాధ్యతారాహిత్యంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. ప్రధానంగా చెరువులకు గత ఉమ్మడి రాష్ట్ర దుస్థితి దాపురిస్తున్నది. నాడు చుక్కనీరు లేక ఎండిపోగా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరంతో ఏడేండ్ల పాటు సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు జలకళ తో కళ కళ లాడింది. చెరువులు ఏడాది అంతా నిండుగా ఉండి భూగర్భ జలాలు పెరిగాయి. కానీ మళ్లీ నీటి కష్టాలు మొదలయ్యాయి. కాళేశ్వరం జలాలు రాక చెరువులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఈ స్థాయిలో నీటి సంకటం వస్తుందని రైతులు కలలో కూడా ఊహించి ఉండరు. సూర్యాపేట జిల్లాలోని ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో 732 చెరువులు, కుంటలు ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టు లేక ముందు 2014లో నీళ్లు లేక 85 శాతం చెరువులు ఖాళీగా దర్శనమిచ్చేవి. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత వంద శాతం చెరువులు జలకళ సంతరించుకున్నాయి. చిన్న సాకును చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని పండబెట్టడంతో ప్రస్తుత యాసంగి సీజన్‌లో చెరువులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

– సూర్యాపేట, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ)

**ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో ఎండుతున్న తటాకాలు**

- కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో మళ్లీ ఉమ్మడి రాష్ట్ర దుస్థితి
- సాగు నీరు లేక ఇప్పటికే యాసంగి వరి పొలాలు ఎండుముఖం
- పశువులకు మేతగా మారిన పంటలు
- కేసీఆర్ హయాంలో పుష్కలంగా కాళేశ్వరం జలాలు విడుదల
- నాడు ఒక్క చెరువు, పంట ఎండని పరిస్థితి



ప్రస్తుతం పూర్తిగా ఎండు దశకు వచ్చిన నాగారం మండలం లక్ష్మాపూర్ చెరువు

### కేసీఆర్ హయాంలో ఏడేండ్లపాటు సస్యశ్యామలం

ఉమ్మడి రాష్ట్రంలో 60శాతానికి పైనే చెరువుల్లో అక్కడక్కడ గుంతల్లో అతికొద్ది మేర ఎండ మావుల్లా మచ్చుకు నీరు ఉండేది. వాటితో సాగుమాట దేవుడెరుగు కనీసం పశువుల దాహం కూడా తీరేది కాదు. తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో 732 చెరువులు, కుంటలు ఉండగా 10శాతం చెరువుల్లో కూడా నీరు ఉండకపోయేది. అలాంటి దయనీయ దుస్థితి నుంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మన ఊరు.. మన చెరువు పేరుతో కోట్లాది రూపాయలు వెచ్చించి విస్తరిలా ఉన్న చెరువులను గంగాళాల్లా మార్చారు. అలాగే సాగునీటి గోసను తీర్చేందుకు అపర భగీరథుడిలా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. దీంతో 2017 నుంచి 2023 వరకు సూర్యాపేట జిల్లా ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీళ్లు పుష్కలంగా ఉండడంతో ఏడేండ్ల పాటు రైతులు పండుగలా వ్యవసాయం చేశారు. జిల్లాలో తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాలతోపాటు కోదాడ నియోజకవర్గ పరిధిలోని మోతె, మునగాల, నడిగూడెం మండలాల్లో అత్యధికంగా చెరువులు ఉన్నాయి. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో కొది మేర మాత్రమే చెరువులు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరాన్ని పట్టించుకోకపోవడంతో గోదావరి నీళ్లు రాక ప్రస్తుతం ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువులు వెలవెలబోతున్నాయి.



చుక్కనీరు లేని
ఆత్మకూర్.ఎస్ మండలం శెట్టిగూడెంలోని వేపలచెరువు

**ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలోని చెరువుల్లో నీటి నిల్వల వివరాలు (నాడు-నేడు)**

| | 2014 | 2023 | 2025 |
|---|---|---|---|
| ఎండిపోయినవి | 380 | 0 | 23 |
| 0-25 శాతం | 327 | 15 | 139 |
| 25-50 శాతం | 25 | 102 | 265 |
| 50-75 శాతం | 0 | 237 | 305 |
| 75-100 శాతం | 0 | 275 | 0 |
| అలుగు పోస్తున్నవి | 0 | 102 | 0 |

### పడిపోయిన భూగర్భ జలాలు

బీఆర్ఎస్ హయాంలో నిరంతరం గోదావరి జలాల విడుదలతో ఎస్సారెస్పీ కాల్వలు నిండుగా ప్రవహించేవి. మండు వేసవిలో సైతం 60 శాతం చెరువులు అలుగులు పోశాయి. కాంగ్రెస్ వచ్చిన ఏడాది కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టు పంపులు ఆన్ చేయకపోవడంతో నీళ్లు రాక 70 శాతం చెరువుల్లో నీరు అదఃపాతాళానికి పడిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత వరకు ఒక్క చెరువు కూడా ఎండిపోలేదు. 2023 డిసెంబర్ వరకు 102 చెరువులు అలుగు పోయగా 75 నుంచి 100 శాతం జలకళతో ఉన్నాయి. 237 చెరువులు 50 నుంచి 75 శాతం నీటితో ఉన్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ప్రమాదకర స్థితిలో చెరువులు చేరుతున్నాయి. రానున్న రోజుల్లో చెరువుల్లో నీరు లేక భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. గ్రామాల్లో మళ్లీ నీటి కరువు వస్తుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.



నల్లగొండ బీజేపీ కార్యాలయం ఆవరణలో వర్షిత్‌రెడ్డికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆ పార్టీ శ్రేణులు

## నల్లగొంగ బీజేపీలో రచ్చ


- జిల్లా అధ్యక్షుడిని మార్చాలంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ ముందే బైఠాయింపు

నల్లగొండ రూరల్, ఫిబ్రవరి 9: నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీలో గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. కొద్ది రోజులుగా ఆ వివాదం పార్టీలో రచ్చగా మారింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నాగం వర్షిత్‌రెడ్డి నియామకాన్ని పున: సమీక్షించాలని డిమాండ్ చేస్తూ పలువురు బీజేపీ శ్రేణులు ఆదివారం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి వచ్చిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ముందు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నల్లగొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారు ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడి నియామకం నిబంధనలకు వ్యతిరేకంగా పార్టీ తీసుకుందని, 45-60 ఏండ్ల మధ్య వయస్సు ఉంటేనే ఈ పదవికి అర్హులని తెలిపారు. రెండు సార్లు క్రియాశీలక సభ్యత్వం ఉండాలని, కానీ ఆ నిబంధనలను తుంగలో తొక్కి ఏకపక్షంగా వర్షిత్‌రెడ్డిని నియమించారని చెప్పారు. వర్షిత్‌రెడ్డి ఏకపక్ష నిర్ణయాలతో పార్టీకి జిల్లాలో తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. బీజేపీ నాయకులు పోతేపాక సాంబయ్య, బొజ్జ నాగరాజు, సాయి, రాఖి, రావిరాలు వెంకన్న, ముని, గుర్రం వెంకన్న పాల్గొన్నారు.


# బీఆర్ఎస్ పాలనకే జై..

## యాదాద్రిలో మాజీ ఎమ్మెల్యేల పని తీరు సూపర్

- కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన బ్యాడ్
- ఓ ఆన్‌లైన్ సర్వేలో జిల్లా ప్రజల అభిప్రాయం
- పైళ్ల శేఖర్ రెడ్డికి 61.51 శాతం మంది మద్దతు
- సునీతామహేందర్ రెడ్డికి 48.36 శాతం ఓట్లు
- సర్వేలో ఎమ్మెల్యేలు బీర్ల, కుంభంకు చుక్కెదురు
- ఓట్లు రాబట్టేందుకు కాంగ్రెస్ టీమ్ ఆపసోపాలు
- కాంగ్రెస్‌పై జనంలో వ్యతిరేకతే కారణమా..?
- రానున్న స్థానిక ఎన్నికల్లో పరాభవం తప్పదా..?




ఆలేరు నియోజకవర్గ సర్వే




భువనగిరి సర్వే

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన ప్రజలకు నచ్చలేదా..? అతి తక్కువ కాలంలో సర్కారుపై జనంలో వ్యతిరేకత వచ్చిందా..? స్థానిక ఎమ్మెల్యేలను మెచ్చడం లేదా..? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఓ ప్రైవేట్ లైవ్ సర్వే ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీఆర్ఎస్ పాలనే బాగుందని కుండబద్ధలు కొట్టారు. ఆలేరు, భువనగిరి రెండు నియోజకవర్గాల్లోనూ మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి బాగా పని చేశారంటూ కితాబిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన, పనితీరుపై ఆ పార్టీ ఆన్‌లైన్ సర్వే నిర్వహించి అభాసుపాలు అయిన విషయం తెలిసిందే. ఆ సర్వేలో ప్రజలు బీఆర్ఎస్‌కు అనుకూలంగా తీర్పించారు. సరిగ్గా అదే విధంగా యాదాద్రి జిల్లాలోనూ ఆన్‌లైన్ లైవ్ సర్వే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. స్ట్రాపోల్ డాట్ కమ్ అనే వెబ్ సైట్ లింక్ వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా షేర్ అవుతున్నది. ఇందులో ఆసక్తికర తీర్పు వెళ్లడైంది.

**భువనగిరిలో పైళ్లకే పట్టం..**

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత రెండు పర్యాయాలు భువనగిరి ఎమ్మెల్యేగా పైళ్ల శేఖర్ రెడ్డి పనిచేశారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోగా.. అనిల్ కుమార్ రెడ్డి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే లైవ్ పోల్ సర్వే కుంభం అనిల్‌కు చుక్కెదురైంది. శేఖర్ రెడ్డికి జనం ఓటేశారు. ఆదివారం రాత్రి 7గంటల వరకు వచ్చిన డేటా ప్రకారం 2,459 ఓట్లతో 61.51శాతం మంది ఓటేశారు. కుంభంకు కేవలం 1,539 ఓట్లతో 38.49శాతం మాత్రమే పోలయ్యాయి. మొత్తం 3,998 మంది పోల్‌లో పాల్గొన్నారు.

**ఆలేరులో సునీతమ్మకు..**

జిల్లాలోని మరో నియోజకవర్గమైన ఆలేరులో సైతం బీఆర్ఎస్‌కే మొగ్గు చూపారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి పాలనకే ఫిదా అయ్యారు. సర్వేలో బీఆర్ఎస్‌కు 829 ఓట్లతో 48.39 శాతం ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 746 ఓట్లతో 43.55శాతం మంది ఓట్లేశారు. 8.06 శాతం మంది రెండూ బాగాలేవని స్పష్టం చేశారు. సర్వేలో 1,713 మంది పాల్గొన్నారు.

**కాంగ్రెస్ టీమ్ ఆపసోపాలు..**

ఆన్‌లైన్ సర్వేలో కాంగ్రెస్‌కు పరాభవం ఎదురుకావడంతో ఆ పార్టీ సోషల్ మీడియా టీమ్‌లు రంగంలోకి దిగాయి. సర్వేలో ఓట్ల శాతం పెంచుకునేందుకు ఆపసోపాలు పడ్డాయి. కాంగ్రెస్ గ్రూపులో సర్వే లింక్‌ను షేర్ చేశాయి. అయినప్పటికీ కాంగ్రెస్‌కు పాజిటివ్ స్పందన రాలేదు. బీఆర్ఎస్‌కు స్వచ్ఛందంగా మద్దతు లభించింది. దీంతో చేసేదేం లేక సోషల్ టీములు తలలు పట్టుకున్నాయి. మరికొద్ది రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు రానుండటంతో.. కాంగ్రెస్ మద్దతుదారులకు పరాభావం ఎదురయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

**కాంగ్రెస్ వైఫల్యాలే కారణమా..?**

ఆన్‌లైన్ సర్వేలో కాంగ్రెస్‌కు తక్కువ ఓట్ల శాతం రావడంపై రాజకీయ విశ్లేషకులు పలు విధాలుగా విశ్లేషణలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచి రైతుల వ్యతిరేకత మూట కట్టుకుంటున్నదని అంటున్నారు. రైతుబంధు సాయం పెంచలేదని, మధ్యలో ఒక సీజన్‌కు ఎగవేసిందని, ఇప్పుడు కూడా ఇంకా డబ్బులు జమ చేయలేదని పేర్కొంటున్నారు. రుణమాఫీ కొందరికే అమలు చేశారని వివరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలులో విఫలమైందని అంటున్నారు.విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు అన్ని వర్గాల వారిని మభ్య పెట్టి అధికారంకి వచ్చిందని, ఏ ఒక్క పథకం సరిగ్గా అమలు చేయడం లేదని ఎత్తిచూపుతున్నారు. మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి పథకాలు చేయడంపై జనం గుస్సగా ఉన్నారని చెప్పుకొస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేల పని తీరుపైనా జనం ఆగ్రహంగా ఉన్నారని, ఏడాది పాలనలో చెప్పుకోదగిన పనులు ఏమీ లేవని పేర్కొన్నారు. నిధులను తీసుకురావడంలో సక్సెస్ కాలేదనే అపవాదు ఉందని, ప్రజలు, కేడర్‌ను దూరం పెట్టారని తెలియజేస్తున్నారు.





## రిజర్వేషన్లపై బీఆర్ఎస్ బీసీ ముఖ్య నేతల సమావేశం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధనపై ఆదివారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ బీసీ ముఖ్య నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ఆయన పలు విషయాలు చర్చించారు. ఉమ్మడి నల్లగొండకు చెందిన మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు నోముల భగత్‌కుమార్, బూడిద భిక్షమయ్యగౌడ్, నాయకులు దూదిమెట్ల బాలరాజుయాదవ్, చెరుకు సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల ఇబ్బందులు పట్టించుకోరా?

**తరగతి గదులే పడక గదులు.. సరిపడా లేని ఫ్యాన్లు**

- అపరిశుభ్రంగా టాయిలెట్స్
- నీటి కొరతతో అర్ధరాత్రి స్నానాలు చేయాల్సిన దుస్థితి
- జనంపల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినుల తల్లిదండ్రుల ఆందోళన
- పేరెంట్స్ మీటింగ్ పెట్టని ప్రిన్సిపాల్ నిలదీత
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



జనంపల్లి గురుకుల పాఠశాల ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థినుల తల్లిదండ్రులు

రామన్నపేట, ఫిబ్రవరి 9 : పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రామన్నపేట మండలంలోని జనంపల్లిలో గల బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ప్రిన్స్‌పాల్ వైఖరిని నిరసిస్తూ ధర్నా చేశారు. గురుకుల సొసైటీ నిబంధనల ప్రకారం ప్రతినెలా రెండో ఆదివారం తల్లిదండ్రులకు తమ పిల్లలను కలిసే అవకాశం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తమ పిల్లలను కలిసేందుకు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చారు. దీంతో పాఠశాల సమస్యలు, విద్యార్థుల ఇబ్బందులను తెలిపేందుకు కొందరు తల్లిదండ్రులు ప్రిన్స్‌పాల్ రాజాను కలిశారు. ఈ క్రమంలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల గురించి ప్రిన్సిపాల్‌కు తెలిపే సమయంలో వాగ్వాదం జరిగింది. పాఠశాలలో నీటి కొరతతో అర్ధరాత్రి స్నానాలు చేయాల్సి వస్తుందని, బాత్‌రూమ్‌పై రేకులు లేక పోవడంతో కోతులు దాడులు చేస్తూ గాయ పరుస్తున్నాయని, తరగతి గదుల్లో ఫ్యాన్‌లు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. బాత్‌రూమ్‌లలో కంపువాసన కొడుతుందన్నారు. నెలనెలా తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. పిల్లలు అనారోగ్యం పాలైతే పరిస్థితి విషమించే వరకు తమకు సమాచారం అందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డార్మిటరీలు లేక పోవడంతో తరగతి గదుల్లోనే విద్యార్థులు పడుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్, సిబ్బందికి ఫోన్ చేసినా స్పదించరని ఆరోపించారు. అనంతరం పాఠశాల ప్రధాన ద్వారం వద్ద ప్రిన్సిపాల్ అందుబాటులో ఉంటూ, నిరంతరం పర్యవేక్షిస్తూ నెల నెల పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆందోళన చేపట్టారు.

**320 మందికే వసతులు : ప్రిన్సిపాల్**

గురుకుల పాఠశాలలో మొత్తం 585 మంది విద్యార్థినులు ఉన్నారని, 320 మందికి మాత్రమే సరిపడా వసతులు ఉన్నాయని ప్రిన్సిపాల్ రాజా వివరణ ఇచ్చారు. పాఠశాలలో నీటి సమస్య, కోతుల సమస్య ఉందని, విద్యార్థుల ఆరోగ్య విషయంపై తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని, సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లున్నట్లు తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, చదువు పట్ల కఠినంగా వ్యవహరిస్తానని తనపై ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు.

**విద్యార్థులను ఖైదీల్లా వ్యవహరిస్తున్నారు**



పిల్లలను కలుస్తామని వస్తే కలువకుండా గేటు బయటి నుండే మాట్లాడమని ఖైదీల్లాగా వ్యవహరిస్తున్నారు. పిల్లలు అనారోగ్యం పాలైతే సమాచారం కూడా ఇవ్వరు. బాత్‌రూమ్‌లకు పైకప్పులు లేక పోవడంతో కోతులు ఎగపడుతున్నాయి. బాత్‌రూమ్‌లు దుర్వాసనతో అపరిశుభ్రంగా ఉంటాయి.

- రవి నాయక్, దామరచర్ల, విద్యార్థిని తండ్రి

**గతిలేక చేర్పించినట్లుంది**



పాఠశాలలో గతిలేక చేర్పించినట్లు ఉంది. చదువు సరిగ్గా లేదు. క్లాస్ రూములోనే చదువుకోవాలి.. క్లాస్ రూములోనే పడుకోవాలి.. ఫ్యాన్లు లేవు. నీళ్లు రాక పోవడంతో అర్ధరాత్రి రెండు గంటలకు స్నానం చేయాల్సి వస్తున్నది. పేరెంట్స్ మీటింగ్ ఇప్పటివరకు పెట్టలేదు. విద్యార్థులు మంచాలు లేక పోవడంతో కిందనే పడుకోవాల్సి వస్తున్నది.

- ప్రశాంతి, ఇస్కిళ్ల, విద్యార్థిని తల్లి